


# కరపత్రం

SINCE 2014

సోమవారం ఏప్రిల్ 20, 2026 | సంపుటి : 2 | సంచిక : 189 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## తూర్పున సీఎం..
## పశ్చిమాన మాజీ సీఎం

- ఒకేరోజు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ పర్యటనలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాపై రాజకీయ దృష్టి
- తూర్పు ప్రాంతాల్లో సీఎం పరిపాలన సమీక్ష
- పశ్చిమంలో జగిత్యాలలో కేసీఆర్ సభ
- శక్తి ప్రదర్శనగా మారిన పర్యటనలు
- భవిష్యత్ ఎన్నికలకు పునాది వేయాలనే వ్యూహం
- జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరికతో రాజకీయ సమీకరణాలు మారే సూచనలు
- మేడిగడ్డ బారేజ్ అంశం రాజకీయంగా హాట్ టాపిక్
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ విమర్శలకు వేదికగా సీఎం టూర్
- కేసీఆర్ ప్రసంగం పార్టీ భవిష్యత్ దిశకు కీలకం

ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమానికి కేంద్రబిందువు. ఈ ప్రాంతంలో రాజకీయ చైతన్యం ఎప్పుడూ ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడ జరిగే ప్రతీ చిన్న పరిణామం రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా కేంద్రంగా తెలంగాణ రాజకీయాల్లో ఈనెల 20న సోమవారం ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకోనుంది.

సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లా పర్యటనలు కేవలం స్థానిక రాజకీయాలకే పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముంది. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తూర్పు ప్రాంతాల్లో పర్యటిస్తూ పాలన, ప్రాజెక్టుల స్థితిగతులను పరిశీలించనుండగా, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పశ్చిమ ప్రాంతమైన జగిత్యాలలో జరిగే పార్టీ బహిరంగసభలో రాజకీయంగా కీలకమైన సందేశం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఈ సమాంతర పర్యటనలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్నాయి.




## డీలిమిటేషన్ పేరుతో దక్షిణాదికి అన్యాయం..

### కేంద్రం కుట్రలను తిప్పికొట్టాం: మంత్రి పొంగులేటి

» డీలిమిటేషన్ పేరుతో దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారన్న పొంగులేటి విమర్శ
» మహిళా బిల్లు ముందుపెట్టి కేంద్రం కుట్రలు చేసిందని ఆరోపణ
» ఇండియా కూటమి ఆ కుట్రలను తిప్పికొట్టిందని వ్యాఖ్య
» కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని స్పష్టం
» మేడారం మాస్టర్ ప్లాన్ పనులపై సమీక్ష
» గాయపడిన బాలుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్న హామీ
» కృత్రిమ కాలు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ

**సీతక్క వ్యాఖ్యలు:**

» మహిళలపై బీజేపీ కపట ప్రేమ చూపుతోందని విమర్శ
» డీలిమిటేషన్‌తో దక్షిణాది ప్రాధాన్యత తగ్గించే కుట్ర అని ఆరోపణ
» RSS, బీజేపీలో మహిళలకు ప్రాధాన్యత ఉందా? అని ప్రశ్న
» మహిళలకు కాంగ్రెస్సే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని వ్యాఖ్య
» జనగణన లేకుండా డీలిమిటేషన్ ఎలా? అని ప్రశ్న

కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి దక్షిణాదికి అన్యాయం చేసే కుట్ర చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.ఆ కుట్రలను ఇండియా కూటమి పసిగట్టి తిప్పికొట్టిందన్నారు. ఆ బిల్లును వీగిపోయేలా చేసిన ఇండియా కూటమి పక్షాలకు అభినందనలు తెలిపారు పొంగులేటి. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వ్యతిరేకం కాదన్నారు..

మంత్రి సీతక్కతో కలిసి మేడారం సమ్మక్కసారక్కను దర్శించుకున్న ఆయన.. మేడారం మాస్టర్ ప్లాన్ చివరి దశలో ఉన్న పనులపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కొద్దిరోజుల క్రితం గద్దెల ప్రాంగణంలో స్థానిక పూజారి కుమారుడు యూవిన్ కాలు విరగడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. ఇప్పటికే బాలుడి తల్లికి దేవాదాయ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చామన్నారు. ఎంత ఖర్చు ఐనా పర్వాలేదు. కృత్రిమ కాలు పెట్టిస్తామని చెప్పారు పొంగులేటి.

**- మహిళల మీద బీజేపీది కపట ప్రేమ: సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం మహిళల మీద కపటప్రేమ, నాటకాలు మొదలు పెట్టింది. మహిళల బిల్లు అని చెప్పి డీ లిమిటేషన్ ద్వారా సౌత్ ఇండియాకు ప్రాధాన్యత తగ్గించే కుట్రలు చేస్తున్నారు .మహిళా బిల్లు పేరుతో జరుగుతున్న కొత్త కుట్రలివి. దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం లేకుండానే దేశాన్ని పాలించేందుకు ఈ తరహా కుట్రలకు తెరలేపారు . బిజెపి మాతృ సంస్థ ావాలో మహిళలకు ప్రాధాన్యత ఉందా.. మహిళలకు సభ్యత్వం ఉందా.. ముందు మీ చిత్తశుద్ధిని నిరూపించుకోండి. బిజెపి పుట్టినప్పటి నుంచి ఒక్కసారైనా మహిళను జాతీయ అధ్యక్షురాలిని చేశారా... మహిళలను గౌరవించి ప్రోత్సహించే పార్టీ కాంగ్రెస్ పార్టీ. దేశంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది కాంగ్రెస్. బెంగాల్, తమిళనాడులో మహిళా ఓట్ల కోసమే బీజేపీ ఈ డ్రామా. జనగణన లెక్కలు తేలకుండా ఎలా డీ లిమిటేషన్ చేస్తారు అని సీతక్క ప్రశ్నించారు.



## తెలంగాణపై కామెంట్స్ వివాదం.. ఏమాత్రం తగ్గని తేజస్వీ సూర్య.. క్షమాపణలు చెప్పిన కేంద్రమంత్రి

తెలంగాణ విభజనపై లోక్ సభలో చేసిన కామెంట్లపై ఏమాత్రం తగ్గడం లేదు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య. తెలంగాణ విభజనపై తాను సరిగ్గానే చెప్పాను.. విపక్ష కాంగ్రెస్ నేతలే తప్పుగా అర్థం చేసుకున్నారని సమర్థించుకున్నారు. తన మాటలను వక్రీకరించారని ఆరోపించారు.



## మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు: - ఎంపీ చామల

హైదరాబాద్:
ఇండి కూటమిపై భాజపా దుష్ప్రచారం చేస్తోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని.. డీలిమిటేషన్‌కు వ్యతిరేకమని స్పష్టం చేశారు. భాజపా దుష్ప్రచారాన్ని మహిళలు పట్టించుకోవద్దని కోరారు."మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు. మహిళా రిజర్వేషన్ల బిల్లు 2023లోనే ఆమోదం పొందింది. తమిళనాడు, బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి కోసమే మళ్లీ బిల్లు తెచ్చారు. 2023లో బిల్లు ఆమోదం పొందినా.. 2024లో రిజర్వేషన్లు అమలు చేయలేదు" అని చామల పేర్కొన్నారు.




## సైబర్ మోసాల భారీ నెట్‌వర్క్‌ను ఛేదించిన హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్:
దేశవ్యాప్తంగా సాగుతున్న భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్-2.0' పేరుతో 9 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించిన పోలీసులు పలువురు బ్యాంకు అధికారులు సహా 52 మంది నిందితులను ఆరెస్టు చేశారు. పెట్టుబడి స్కామ్‌లు, ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో అమయాకులను బెదిరించిన నేరగాళ్లు భారీగా సొమ్మును దోచుకున్నట్లు తేల్చారు.

## అబద్ధాల పునాదులపైనే రేవంత్ సీఎం అయ్యారు: బండి సంజయ్

» మహిళలను మోసం చేశారని విమర్శ
» నెలకు -2500 హామీ నిలబెట్టలేదని వ్యాఖ్య
» బంగారం, స్కూటీ వాగ్దానాలు అమలు కాలేదని ఆరోపణ
» మహిళా బిల్లును అడ్డుకున్నారని విమర్శ
» కేసీఆర్ తరహాలోనే మోసపూరిత పాలన అన్న వ్యాఖ్య



హైదరాబాద్: అబద్ధాల పునాదులపైనే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆ అబద్ధాలతోనే మహిళా లోకాన్ని మోసం చేశారని విమర్శించారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. తులం బంగారం, స్కూటీ ఇస్తానంటూ నిలువునా ముంచారని ఆక్షేపించారు. మహిళా బిల్లును అడ్డుకొని దక్షిణాదికి ద్రోహం చేశారని, కేసీఆర్ తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా అబద్ధాలు, మోసాలతోనే పాలన చేస్తున్నారని మండిపడ్డారు.




## ప్రయాణికుల భద్రత ప్రభుత్వ బాధ్యత - సుప్రీంకోర్టు

దేశంలో పెరిగిపోతున్న రహదారి ప్రమాదాల నియంత్రణకు సుప్రీంకోర్టు (ాబజూతీవవఎవ జశీబతీ) మార్గదర్శకాలు వెలువరించింది. రాజస్థాన్‌లోని ఫలోడీ, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదాలను సుమోటోగా తీసుకున్న న్యాయస్థానం విచారణ జరిపింది. రహదారులపై అక్రమ పార్కింగ్‌లు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా జీవించే హక్కును ఇచ్చిందని గుర్తుచేసింది.

## పచ్చి అబద్ధాలకు..
## బ్రాండ్ అంబాసిడర్ హరీష్ రావు

- హరీష్ రావుపై తీవ్ర విమర్శలు
- బీఆర్ఎస్‌పై ఆది శ్రీనివాస్ ఫైర్
- అబద్ధాల రాజకీయమని ఆరోపణ
- రాష్ట్రం అప్పుల్లోకి నెట్టారన్న విమర్శ
- కేసీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలు
- క్రాస్ ఓటింగ్‌పై ప్రశ్నలు
- ఫిరాయింపులకు బీఆర్ఎస్ కారణమని ఆరోపణ
- అధికారం కోసమే ఆరాటమని విమర్శ
- బీఆర్ఎస్ మాటల్లో విశ్వసనీయత లేదని వ్యాఖ్య



బీఆర్ఎస్ నేతల తీరుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిప్పులు చెరిగారు. హరీష్ రావు పచ్చి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజలను పక్కదోవ పట్టించడం తప్ప బీఆర్ఎస్ నేతలకు మరో ఆలోచన లేదని మండిపడ్డారు.పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత గులాబీ పార్టీదేనన్న ఆది శ్రీనివాస్.. కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకం అంటూఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు ఎవరూ అనుకోవడం లేదని.. కేవలం బీఆర్ఎస్ నేతలు మాత్రమే సొంత డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా క్రాస్ ఓటింగ్, పార్టీ ఫిరాయింపులపై ఆది శ్రీనివాస్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వారు మీకు మంచోళ్లు అయ్యారా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులకు పితామహుడు కేసీఆర్ అని.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ నేతలు వాడుతున్న క్రాస్ బ్రీడ్, హైబ్రీడ్ వంటి పదజాలం వారికే వర్తిస్తాయని.. అధికారం కోసం, ప్రజలను దోచుకోవడం కోసమే వారి ఆరాటమంతా అని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ప్రతి మాటలోనూ అబద్ధాలు ఆడుతూ బీఆర్ఎస్ పార్టీ దిగజారి మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నీటమునిగి ఇద్దరు విద్యార్థుల మృత్యువాత



మేడ్చల్:
మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందారు. మృతుల్లో ఒకరు ఉమన్ (14) మునీరాబాద్‌లోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండగా.. మరో బాలుడు ఇర్ఫాన్ (12) డబిల్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. విద్యార్థులు మునిగిపోయినట్లు గుర్తించిన స్థానికులు వెంటనే బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తా: మంత్రి వివేక్ వెంకటస్వామి




» హమాలీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తానన్న మంత్రి వివేక్
» కార్మికుల సంక్షేమమే తన లక్ష్యమని స్పష్టం
» యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ?10 లక్షలకు పెంపు
» గిగ్ వర్కర్స్ భద్రత కోసం చట్టం ప్రవేశపెట్టినట్టు వెల్లడి
» సిద్దిపేటలో కార్మిక భవనానికి స్థలం, నిర్మాణ హామీ
» ప్రతి జిల్లాలో కార్మిక భవనాల నిర్మాణానికి కృషి
» విదేశీ ఉద్యోగాల కోసం ?90 కోట్లు మంజూరు
» లేబర్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ

## అజారుద్దీన్‌కు కష్ట కాలం. మంత్రి పదవి ఉంటుందా?

హైదరాబాద్:
తెలంగాణ రాజకీయాల్లో మాజీ క్రికెటర్, ప్రస్తుత మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆయన మంత్రి పదవికి సంకట పరిస్థితి వచ్చింది. మంత్రి పదవి ఇప్పుడు ఒక రాజ్యాంగపరమైన గడువుపై ఆధారపడి ఉంది. ఈనెల 30తో అజారుద్దీన్ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు కానుంది. దీంతో ఈనెల 30 లోపు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అజారుద్దీన్ కాకుంటే.. మంత్రి వర్గం నుంచి ఆయనను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఏప్రిల్ 20, 2026

## సైబర్ మోసాల భారీ నెట్‌వర్క్‌ను ఛేదించిన హైదరాబాద్ పోలీసులు

మొదటిపేజీ తరువాయి
సైబర్ ముఠాకు అండగా నిలుస్తున్న బ్యాంకు అధికారులే లక్ష్యంగా ఆపరేషన్ కొనసాగినట్లు పోలీసులు వెల్లడించారు.నిందితుల్లో 32 మంది బ్యాంకు అధికారులు, 15 మంది మ్యూల్ ఖాతాదారులు, ఐదుగురు మీడియేటర్లు ఉన్నారు. నేరగాళ్లతో కుమ్మక్కైన బ్యాంకు అధికారులు.. అక్రమంగా వారికి ఖాతాలు తెరిచి ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో 16 ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల సొమ్మును దారి మళ్లించేందుకు నేరగాళ్లు ఏకంగా 350 బ్యాంకు ఖాతాలను వినియోగించినట్లు గుర్తించారు. ఈ ఖాతాలకు దేశవ్యాప్తంగా నమోదైన సుమారు 850 సైబర్ కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.150 కోట్ల మేర మోసాలు జరిగినట్లు పోలీసులు నిర్ధరించారు.

## తెలంగాణపై కామెంట్స్ వివాదం.. ఏమాత్రం తగ్గని తేజస్వీ సూర్య.. క్షమాపణలు చెప్పిన కేంద్రమంత్రి

మొదటిపేజీ తరువాయి
మరోవైపు తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి శోభా కరందాజ్లే స్పందించారు. తేజస్వీ వ్యాఖ్యలు సరియైనవి కావని చెప్పారు. తేజస్వీ వ్యాఖ్యలకు తాము బాధపడుతున్నట్లు చెప్పారు.. తేజస్వీ సూర్య తరపును తాను క్షమాపణ చెబుతున్నానని తెలిపారు శోభా కరందాజ్లే.

పార్లమెంట్ స్పెషల్ సెషన్ సందర్భంగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య లోక్ సభలో అసందర్భంగా తెలంగాణ విభజనపై వివాదాస్ప వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజనను భారత్ పాక్ విభజనతో పోల్చారు. తేజస్వీ కామెంట్స్ పై కాంగ్రెస్ , బీఆర్ ఎస్ ఎంపీలు, ఉద్యమకారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీ తేజస్వీ సూర్య సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు తేజస్వీ సూర్య బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు.

## హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తా: మంత్రి వివేక్ వెంకటస్వామి

మొదటిపేజీ తరువాయి
సిద్ధిపేటలో భావన నిర్మాణ కార్మికులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఆదివారం ( ఏప్రిల్ 19 ) సిద్ధిపేటలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. సింగరేణి కార్మికుల సంక్షేమానికి మా నాన్న కాక వెంకటస్వామి కృషి చేశారని..పీవీ నరసింహారావుతో కొట్లాడి సింగరేణి భూముల రక్షణ,కార్మికుల పెన్షన్లకు కృషి చేశారని అన్నారు. కాకా వెంకటస్వామి మార్గంలోనే కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలనేది తన తపన అని.. హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు.

కార్మికులకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలకు పెంచామని...గిగ్ వర్కర్స్ భద్రత కోసం గిగ్ వర్కర్స్ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టామని అన్నారు. సిద్ధిపేట పట్టణంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక భవనానికి స్థల కేటాయింపుతో పాటు భవన నిర్మాణానికి మాట ఇస్తున్నానని అన్నారు.కేవలం ఓట్ల కోసం మాజీ మంత్రి హరీశ్ రావు హామీలు ఇచ్చాడని అన్నారు.

రాబోయే రోజుల్లో ప్రతీ జిల్లాకు భవన నిర్మాణ కార్మికుల భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని అన్నారు మంత్రి వివేక్. జర్మనీ పర్యటనలో భాగంగా కార్మికులకు విదేశాల్లో ఉద్యోగాల కల్పనకు రూ.90కోట్లు మంజూరు చేశామని అన్నారు.టామ్ కాం కంపెనీ ద్వారా విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నామని..భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ల విషయంపై త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

త్వరలోనే లేబర్ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రంగాల కార్మికులకు లేబర్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు,పెన్షన్లు,యాక్సిడెంట్ ఇన్సూరెన్సులు అందేలా కార్యాచరణ సిద్ధం చేస్తానని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

## ప్రయాణికుల భద్రత ప్రభుత్వ బాధ్యత

మొదటిపేజీ తరువాయి
ఈ అధికరణంలోనే ప్రతి ప్రయాణికుడికి ప్రమాదరహితంగా వెళ్లే హక్కు అంతర్గతంగా ఉందని తెలిపింది. ప్రయాణికుల భద్రతను ప్రభుత్వ బాధ్యతగా చూడాలని తెలిపింది.

### మార్గదర్శకాల్లో కొన్ని..

- **అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానంలో భాగంగా ఎప్పటికప్పుడు రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు ఏర్పాట్లు**
- **రైట్ ఆఫ్ వేలో (రహదారిఃమార్జిన్)లలో నూతన దాబా, హోటల్, వాణిజ్య నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదు**
- **జాతీయ రహదారుల వెంబడి నిర్మించిన అక్రమ నిర్మాణాలను 60 రోజుల్లోగా తొలగించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి**
- **జాతీయ రహదారులు వెళ్తున్న జిల్లాల్లో.. 15 రోజుల్లోగా జిల్లా రహదారుల భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి**
- **రాష్ట్ర పోలీసు, రవాణాశాఖకు చెందిన అధికారులు నిరంతరం రహదారులను పర్యవేక్షించాలి. వీరు వెళ్లే వాహనాలకు ట్రాకింగ్ పరికరాలను అమర్చాలి**
- **ప్రతి 75 కి.మీలకు వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలి. వీటిలో విశ్రాంతి గదులు, హోటల్స్.. తదితర సౌకర్యాలను కల్పించాలి**
- **ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాలి. అక్కడ రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులను ఉంచాలి**
- **రెండు నెలల అనంతరం అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలపై న్యాయస్థానం సమీక్ష నిర్వహించనుంది**

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

### – రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేసింది. తాజాగా హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై కాల్పులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులకు పాల్పడినట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. వాటిల్లో భారత జెండా ఉన్న ట్యాంకర్ ఒకటి ఉన్నట్టు సమాచారం. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీకి చెందిన ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయి. అయితే ఈ దాడిలో ట్యాంకర్లు, వాటిల్లోని సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో భారత్‌కు చెందిన మరో రెండు నౌకలను దారి మళ్లించినట్టు 'ట్యాంకర్ ట్రాకర్స్' తెలిపింది. ఇరాక్ నుంచి రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకొస్తున్న ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధి నుంచి వెనక్కి మళ్లినట్టు సమాచారం. కాగా, అమెరికాతో చర్చల సందర్భంగా హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు శుక్రవారం ఇరాన్ ప్రకటించింది. అయితే ఇరాన్ ఓడ రేవుల చుట్టు అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. దీంతో ఇరాన్ తిరిగి హోర్ముజ్ జలసంధిని మూసేసింది. హోర్ముజ్ జలసంధిని మూసేసినట్టు ఇరాన్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ కాల్పులు జరిగాయి.

## తూర్పున సీఎం.. పశ్చిమాన మాజీ సీఎం

మొదటిపేజీ తరువాయి
**రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి...**

సీఎం, మాజీ సీఎం పర్యటనలు ఒకేరోజు ఉండడంతో ప్రజల దృష్టి పూర్తిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాపైనే ఉంది. ఇది రాజకీయంగా శక్తి ప్రదర్శనగా మారింది. ఒకవైపు అధికార పార్టీ తన పరిపాలనను సమర్థించుకుంటూ, గత ప్రభుత్వాన్ని విమర్శించేందుకు సిద్ధమవుతుండగా, ప్రతిపక్షంగా బీఆర్ఎస్ తన బలాన్ని చాటుకునేందుకు ప్రయత్నించే అవకాశముంది. ఇద్దరు నేతల పర్యటన భవిష్యత్ ఎన్నికలకు పునాదులు వేసుకునేందుకేనని స్పష్టమవుతోంది. జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నేత బీఆర్ఎస్‌లో చేరిక ఆ పార్టీకి మోరల్ బూస్ట్, కాంగ్రెస్‌కు పరీక్షగా మారనుంది.

### ఒక్కటవుతున్న ప్రత్యర్థులు

తెలంగాణ మలి దశ ఉద్యమం కరీంనగర్ నుంచే ప్రారంభమైంది. కరీంనగర్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన కేసీఆర్.. తనపై రెండుసార్లు పోటీ చేసిన జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకోవడానికి ఈనెల 20న సోమవారం జగిత్యాలకు వస్తున్నారు. ఇన్నాళ్లు మౌనంగా ఉన్న కేసీఆర్ ఈసారి తనదైన శైలిలో రాష్ట్రపరిస్థితులపై మాట్లాడే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో జగిత్యాలలో కేసీఆర్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా కాంగ్రెస్ సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకునే ప్రయత్నం రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. కాంగ్రెస్‌లో నాలుగు దశాబ్దాల పాటు పనిచేసిన నాయకులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపడంతో పార్టీలో కొంత కలకలం రేపుతోంది. కేసీఆర్ జగిత్యాలలో చేసే ప్రసంగం, పార్టీ భవిష్యత్ వ్యూహాన్ని వెల్లడించే అవకాశముంది. ఆయన ప్రభుత్వం మీద చేసే విమర్శలు, కాంగ్రెస్ పాలనలో లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తారని అంచనా.

### ఆసక్తికరంగా సీఎం పర్యటన

ఉమ్మడి జిల్లా పరిధిలోని మంథని నియోజకవర్గంలో ఉన్న మేడిగడ్డ బారేజ్ అంశం ఇప్పుడు కేవలం ఇంజినీరింగ్ సమస్య కాదు.. రాజకీయ ఆయుధంగా మారింది. మేడిగడ్డ బారేజ్ కుంగిన ఘటనను పరిశీలించడానికి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పించనున్నారు. మేడిగడ్డ బారేజ్, కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక భాగం కావడం 2023 ఎన్నికల్లో ప్రచారం సందర్భంగా అది కుంగిన విషయం బయటకు రావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని కాంగ్రెస్ ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందింది. కాటారం సభలో రేవంత్ రెడ్డి ప్రసంగం కీలకంగా మారనుంది. ఆయన బీఆర్ఎస్‌పై మాటల దాడి చేయడం, అవినీతి ఆరోపణలను పునరుద్ఘాటించడం, అభివృద్ధి వాగ్దానాలను ముందుకు తెచ్చే అవకాశముంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని ప్రజల ముందు తీసుకెళ్లి, బీఆర్ఎస్ పాలనలో జరిగిన లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తోంది.

## అజారుద్దీన్‌కు కష్ట కాలం. మంత్రి పదవి ఉంటుందా?

మొదటిపేజీ తరువాయి
ఈ నేపథ్యంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం ఫైల్‌పై గవర్నర్‌ను సంతకం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరనున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఈరోజు ఉదయం 11 గంటలకు లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ కానున్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై చర్చించనున్నారు. ఈ క్రమంలో గవర్నర్, సీఎం భేటీపై ఉత్కంఠ నెలకొంది. గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(4) ప్రకారం ఒక వ్యక్తి ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ కాకుండా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఆరు నెలల లోపు అసెంబ్లీ లేదా మండలికి ఎన్నిక కావాలి. అత్యవసర పరిస్థితుల్లో లేదా పరిపాలనా సౌలభ్యం కోసం, అనుభవజ్ఞులను ప్రభుత్వంలోకి తీసుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించబడింది. కాగా, అంతకుముందు అజారుద్దీన్ అక్టోబర్ 31, 2025న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంటే ఆయన ఆరు నెలల గడువు ఈ నెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 30వ తేదీలోపు ఆయన ఎమ్మెల్సీగా ప్రమాణం చేయకపోతే, సాంకేతికంగా ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.

**ఎందుకు ఈ పరిస్థితి..**

కాగా, రేవంత్ ప్రభుత్వం ఆయన పేరును గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ పదవికి ప్రతిపాదించింది. అయితే.. గతంలో గవర్నర్ కోటా నామినేషన్లపై కోర్టులో వివాదాలు నడవటం, ఆ తర్వాత కొత్త గవర్నర్ రాక వంటి పరిణామాల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌తో చర్చలు జరిపి ఈ అడ్డంకిని తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ గవర్నర్ కోటా క్లియర్ కాకపోతే.. ఖాళీగా ఉన్న ఏదైనా ఇతర ఎమ్మెల్సీ స్థానం.. స్థానిక సంస్థలు లేదా ఎమ్మెల్యే కోటా ద్వారా ఆయన్ని మండలికి పంపాల్సి ఉంటుంది. ఇది కూడా ఫలించని నేపథ్యంలో అజారుద్దీన్ మంత్రి బాధ్యతల నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## మాదక ద్రవ్య రహిత సమాజం కోసం పోరు

### ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పిలుపు

గంజాయి మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం కలిసి పోరాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి సావిత్రి పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య భవన్ లో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో యువత డ్రగ్స్ కి మద్యనీ అలవాటయ్యి మహిళల పైన హత్యలు, మానభంగాలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరు, కడప, విశాఖ, మదనపల్లి, కర్నూలు జిల్లాలో, ఇలా చెప్పుకుంటూపోతే రాష్ట్రవ్యాప్తంగా కూడా అనేక హత్యలు మహిళలపైన ఎక్కువ జరుగుతున్నాయి. ఒక్క నెలలో 18 కేసులు అత్యాచారాలకు మర్డర్లకి మహిళలు గురయ్యారు .దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఏ రాజకీయ పార్టీలోఉన్న నాయకులు డ్రగ్స్ మాఫియాకుఅండగా ఉంటారో వారిని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులకు గాని పార్టీ సభ్యత్వానీ నుండి తొలగించాలని పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. వాళ్లపైన పార్టీలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తుంది. మద్యాన్ని కంట్రోల్ చేయాల్సిన ప్రభుత్వాలే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేశారు,ఇది సరైనది కాదని తెలియజేశారు. ఏదైనా యువతకు నాణ్యమైన విద్య నాణ్యమైన ఆహారము నాణ్యమైన వైద్యం అందించాలని ఐద్వా డిమాండ్ చేసింది.మహిళలకుఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మద్యం, డ్రగ్స్ , కంట్రోల్ చేసి యువతకు మంచి భవిష్యత్తు అందించాలని మహిళల మానప్రాణాలను కాపాడాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పరువు హత్యలు ఎక్కువైనాయని చిన్న పిల్లలకి ఎక్కడ రక్షణ లేకుండా పోయిందని ఇవన్నీటికీ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి అగత్యాలకు పాల్పడిన వాళ్ళని కఠినంగా శిక్షించాలని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజలందరూ గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాల పైన కలిసి వచ్చే సంఘాలతో కలిసి వచ్చే మేధావులు అందరిని కలుపుకొని ఆందోళనకు సిద్ధమవుతమన్నారు. ప్రజా సంఘాలు మద్యానికి డ్రగ్స్ కి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత గా స్వీకరించాలని తెలియజేశారు.

## హర్మ్యూజ్‌పై మళ్లీ పీటముడి మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన

పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. హోర్ముజ్ జలసంధి తెరుచుకుందనే ఆనందం 24 గంటలు కూడా నిలవలేదు. మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా తమ నౌకలపై విధించిన సముద్ర నిర్బంధం కొనసాగు తుండడమే ఇందుకు కారణమని టెహ్రాన్ పేర్కొంది. హోర్ముజ్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ విధించినట్లు ప్రకటించింది. అమెరికా తన నిర్బంధాన్ని ఎత్తివేయకపోతే జలసంధి పూర్తిగా తెరవబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. హోర్ముజ్‌ను తెరిచినప్పటికీ ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడం ఉద్రిక్తతలను పెంచింది. హోర్ముజ్ జలసంధి గురించి, శాంతి ఒప్పందం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో చేస్తున్న పోస్ట్‌లన్నీ అబద్ధాలేనని, దౌత్య చర్చలపై ముందుకు సాగుతుండగా ఇలాంటి తప్పుడు సమచారాన్ని ఇరాన్ అంగీకరించదని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న రెండో దఫా శాంతి చర్చలు జరగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగానే ఇవి జరగబోతున్నట్టు ఇరాన్ మీడియా పేర్కొంటోంది. అయితే ఈ శాంతి చర్చలు వేదిక, తేదీ గురించి అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ క్రమంలో హర్మ్యూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్భందనం ఉన్నంత వరకు హర్మ్యూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మ్యూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.కాగా, ట్రంప్ శనివారం 'కొన్ని మంచి వార్తలున్నాయని చెప్పుకొచ్చారు. బుధవారంలోగా ఒప్పందం కుదరకపోతే యుద్ధంలో కాల్పుల విరమణను పొడిగించకపోవచ్చని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది.

## దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేస్తాం బిజెపి ఎంపి లక్ష్మణ్ హెచ్చరిక

రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. ' మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.

## భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ-భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. కొన్ని పాన్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వస్తువులను సీజ్ చేశారు పోలీసులు. లోకల్ వస్తువులకు బ్రాండెడ్ ముద్ర వేసి అమ్ముతున్న కొన్నింటిని.. అదే విధంగా ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ లోని ఓ పాన్ షాపులో ఈ సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధిలో పరశురామ జయంతి ఆధ్యాత్మిక మహోత్సవం

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 19

జమ్మికుంట పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో పరశురామ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. దేవాలయ ప్రాంగణం నిండా వేదఘోషలు, మంత్రోచ్చారణలు మార్మోగుతూ, భక్తుల హృదయాలను పరమాత్మ సన్నిధికి తీసుకెళ్లాయి. శ్రీ మహావిష్ణువు ఆరవ అవతారమైన పరశురాముడు ధర్మ స్థాపన కోసం అవతరించిన మహా యోగి, క్షత్రియ అహంకారాన్ని నాశనం చేసి, సనాతన ధర్మాన్ని కాపాడిన దైవ స్వరూపుడు. అలాంటి పరమ పవిత్ర అవతారుని జన్మదినోత్సవాన్ని ఈ ఆలయంలో తొలిసారిగా నిర్వహించడం విశేషంగా నిలిచింది.

ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ గోడవర్తి శ్రీనివాస్ శర్మ నేతృత్వంలో వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మంత్రఘోషల మధ్య పరశురాముని ఆవాహన చేసి, భక్తులకు ధర్మ మార్గంలో నడవాలనే సందేశం అందించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయాడు.

పురాణాల ప్రకారం శబరిమల అయ్యప్ప స్వామి



ఆలయ విగ్రహ ప్రతిష్టను పరశురాముడు స్వయంగా నిర్వహించాడని, అలాగే ఆలయ నిర్మాణానికి పందల రాజుకు మార్గదర్శకత్వం వహించాడని విశ్వసిస్తారు. అందువల్ల అయ్యప్ప స్వామి సన్నిధిలో పరశురామ జయంతి నిర్వహించడం ఎంతో పుణ్యఫలదాయకమని పండితులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సిరిమల్ల జయేందర్ గురుస్వామి, రాజేంద్రప్రసాద్, జగదీశ్వర్, దండ ఎల్లారెడ్డి, అనుమాస రాజేందర్, వీరరాజు,



పుల్లూరు ప్రభాకర్, శ్రీధర్, అశోక్, మురళి, సురేష్, ప్రకాష్, వీణాచారి తదితరులు పాల్గొని, పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. అయ్యప్ప స్వామి భక్తులు, హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిరసంలో మునిగిపోయారు.

ఈ సందర్భంగా భక్తులు పరశురాముని ఆశీస్సులు పొందుతూ, ధర్మపథంలో నడిచే సంకల్పంతో స్వామివారిని ప్రార్థించారు. దేవాలయం మొత్తం దైవచైతన్యంతో నిండిపోయి, ఆధ్యాత్మిక శోభతో ప్రకాశించింది.

# ఆరె కులం పై రీ సర్వే చేయాలి

- కుల జనాభాను తక్కువ చూపించడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆరె సంఘ నాయకులు

కరపత్రం ప్రతినిధి ( ఏప్రిల్ 19) :

ఆరె కుల సంక్షేమ సంఘం లోని జనాభాను రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ గా చూపించడం దుర్మాగమని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. హనుమకొండ బాలసముద్రం లోని ఆరె సంఘ భవన్ ట్రస్ట్ కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు,రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ, హాజరైనారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆరె సంఘం నిర్వహించిన అంతర్గత సర్వే ప్రకారం, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలో ఆరె కుల జనాభా సుమారు 8 లక్షల వరకు ఉన్నారని,ప్రభుత్వం




విడుదల చేసిన జన గణన లెక్కలలో కేవలం 1,10,631 గా చూపించడం అన్యాయమన్నారు. ఈ భారీ తేడా ఆరె కులానికి తీవ్ర నష్టం కలిగించే అంశమన్నారు.ఆరె కులస్తులు ప్రధానంగా వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాగిస్తుందని,ఈ కులంలో ప్రచ్ఛన్న నిరుద్యోగం ఎక్కువగా ఉందన్నారు.విద్య,ఆదాయం,భూస్వామ్యం వంటి అన్ని రంగాలలో రాష్ట్ర సగటుతో పోలిస్తే వెనుకబడి ఉందని,ఇప్పటి వరకు ఆరె కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదన్నారు.రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోర్తాల చందర్ రావు లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో ఆరె కులాన్ని చేర్చకపోవడం వల్ల విద్య,ఉపాధి అవకాశాలలో కూడా నష్టపోతున్నారన్నారు.ఆరె కుల జనాభా పై రీ-సర్వే నిర్వహించి నిజమైన లెక్కలు వెల్లడించాలని,ఆరె కుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి కనీసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని,ఆరె కులాన్ని తక్షణమే కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.దీనికి రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా అమోదించారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు నాగుర్ల శంకర్ రావు,వలిగే సాంబరావు,సంపత్ రావు,ఆనంద్ రావు,మారుజోడు నర్సింహా రావు,ఇంగ్లే శివాజీ,సుకినే సంతాజీ,లాండిగా లక్ష్మణ్ రావు, సుకినే రాజేశ్వర్ రావు,జగన్ మోహన్,మటిక సంతోష్, దూమల సుధాకర్,హింగే రాజేశ్వర్ రావు,బాపూరావు,వంచనగిరి వీరేశం,వలిగే నర్సింగ రావు,దీపక్ జీ,గుండెకారి రవి,సమ్మ రావు,మనోహర్,ప్రభాకర్, సుబ్బరావు,మలహాల్ రావు, ధర్మ రావు, రవీందర్,శంకర్ రావ, యుగేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ రక్షణకు నడుం బిగిద్దాం

- హిందూ సమ్మేళనంలో శ్రీశ్రీశ్రీ ముక్తానంద స్వామీజీ

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 19

హిందూ ధర్మ రక్షణకు ప్రతి హిందువు నడుం బిగించాలని శ్రీశ్రీశ్రీ ముక్తానంద స్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం రోజున కరీంనగర్ లోని బృందావన్ గార్డెన్ లో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన స్వామీజీ మాట్లాడుతూ హిందుత్వము మానవాళి హితం కోరే ధర్మమని, హిందువు మతతత్వవాది కాదని ఆయన చెప్పారు. మతం వేరు, ధర్మం వేరు అని పేర్కొన్నారు. హిందువుగా హిందూ ధర్మాన్ని, సంస్కృతిని తెలుసుకుని ఆచరించాలని వివరించారు. కుటుంబం నుండి పరివర్తన కొరకు మహిళలు పాటుపడాలని కోరారు. దేవాలయాలను శక్తివంతము చేయాలని అన్నారు. హిందువులు కులాల వారీగా విభజించబడడం హేయమని, హిందువులు సమైక్యంగా కలిసి జీవించాలని అన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆర్ ఎస్ ఎస్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ ఎన్నమనేని అశోక్





రావు మాట్లాడుతూ దేశంలో హిందూ సంఘటన అవసరమని చెప్పారు. హిందువులు స్వాభిమానం, దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. దేశభక్తి సంస్థ ఆర్.ఎస్.ఎస్. అని, దేశభక్తులను తయారుచేయటమే ఆర్.ఎస్.ఎస్. వందేళ్ళుగా చేస్తుందని వివరించారు. మరొక మహిళా వక్త నీలిమా మాట్లాడుతూ పంచపరివర్తనతో కుటుంబంలో మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కుటుంబ జీవన విలువలు, సామాజిక సమరసత, స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు అందరము పాటించాలని పేర్కొన్నారు. సమ్మేళనంలో పాఠశాల విద్యార్థులచే వేయబడిన నాటికలు, సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నవి. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం తో, భజనలతో సమ్మేళనం ఆద్యంతం ఆనందంగా ,కోలాహలంగా జరిగింది. హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు గూడ అశోక్ రెడ్డి, మేకల ఓంప్రకాశ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పోరేటర్ లు నాంపల్లి రేణుక శ్రీనివాస్, సాగాని కొమురయ్య , దక్షిణామూర్తి, నాగరాజు, గజేందర్, రవీందర్, రాజిరెడ్డి, మల్లారెడ్డి, మామిడి రమేశ్, ఆదిరెడ్డి, భగత్ నగర్ బస్తీ లోని వివిధ కాలనీల నుండి తరలివచ్చిన హిందూ బంధువులు పాల్గొన్నారు.

# తేజస్వి సూర్య వాక్యలను బీజేపీ సమర్థించడం దుర్మార్గం

- రామిడి శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 19

పార్లమెంట్ వేదికగా బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణా ప్రజలను అవమాన పరిచే విధంగా మాట్లాడడం, దానిని బీజేపీ నాయకులు సమర్థించడం దూర్మార్గమని కాంగ్రెస్ నాయకుడు రామిడి శ్రీకాంత్ రెడ్డి అన్నాడు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం యావత్ తెలంగాణ ప్రజలు పార్టీలకతీతంగా ఒక్కటై పోరాడారని శ్రీకాంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించిన సోనియా గాంధీ ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని తెలిసి కూడా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చి తెలంగాణ ప్రజల గుండెల్లో దేవతగా నిలిచిందని శ్రీకాంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని యావత్ తెలంగాణ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని,



ఆమెను తెలంగాణ తల్లిగా భావిస్తున్నారని తెలిపారు. అలాంటి తల్లిని,తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని విమర్శించడం కోసం పార్లమెంటు వేదికగా బిజెపి ఎంపీ పాకిస్తాన్ విడిపోయిన సంఘటనకు తెలంగాణ ఆవిర్భవానికి ముడిపెట్టి మాట్లాడం తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరచడమేనని శ్రీకాంత్ రెడ్డి ఘాటుగా ఆరోపించారు. తేజస్వి సూర్య మాట్లాడిన దుర్మార్గపు మాటలను ఖండించవలసింది పోయి బిజెపి నాయకులు సమర్థించడం హేయమైన చర్య అని, నిజంగా బిజెపి నాయకులకు తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపడడం పట్ల చిత్తశుది ఉంటే వెంటనే ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే భారతీయ జనతా పార్టీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గాయపరచిన పార్టీగా చరిత్రలో మిగిలిపోతుందని, దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు.

## హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి.

## సమితి అధ్యక్షులు ధనపురి సాగర్



కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 19

కరీంనగర్ మారుతీ నగర్ చౌరస్తాలోని హనుమాన్ దేవాలయం లో శ్రీ మాత అమ్మ భవాని హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో "హిందూ సమ్మేళనంకు ఆహ్వానం" అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్ ను కాపువాడ, మారుతీనగర్ బస్తీ ప్రముఖులచే ఆవిష్కరించడం జరిగిందని మాత అమ్మ భవాని హిందూ సమితి అధ్యక్షులు ధనపురి సాగర్ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ సోమవారం కాపువాడ బస్తీలో నిర్వహించినటువంటి హిందూ సమ్మేళనానికి ప్రతి ఒక్క హిందూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సమాజంలో సామాజిక సామరస్యతను నిర్మాణం చేయడం,కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, స్వదేశీ వస్తు వాడకం , నేను నా దేశం అనే జాతీయ భావాలను పెంపొందించడం, స్వధర్మం పట్ల అంకితభావం, సేవాగుణంను పెంపొందించడం ఈ హిందూ సమ్మేళనం ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు యంసని అశోక్ ,కార్యదర్శి మ్యాడశీ కిరణ్ ,కోశాధికారి రావికంటి సత్యనారాయణ, బస్తీకి చెందిన వివిధ కుల సంఘల పెద్దలు,35 , 36 డివిజన్ కార్పొరేటర్ లు సాధవేణి సుజాత శ్రీనివాస్, తోట అనిల్,వివిధ క్షేత్రాల నాయకులు ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత చెస్ కోచింగ్ క్యాంప్ ని సద్వినియోగం చేసుకోండి.

- ట్రాఫిక్ సిఐ కుమారస్వామి



కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 19

కరీంనగర్ భగత్ నగర్ లోని మల్లమ్మ మార్కెట్ ప్రక్కన గల విశ్వనాథ్ చేశాకడమీలో ప్రతి ఆదివారం ఉచిత చెస్ కోచింగ్ క్యాంప్ ను నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ , చెస్ కోచ్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉచిత చెస్ కోచింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ట్రాఫిక్ సిఐ కుమారస్వామి మొదటి ఎత్తు వేసి ప్రారంభించి మాట్లాడుతూ చెస్ మేధోశక్తిని పెంపొందించే క్రీడగా అభివర్ణించి, ప్రతి విద్యార్థి చెస్లో మెలకువలు నేర్చుకోవాలని, కరీంనగర్ ప్రాంతం వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఉచిత క్యాంప్టన్ నిర్వహిస్తున్న అకాడమీ నిర్వాహకులను సిఐ అభినందించారు.ఈ క్యాంపునకు వివిధ ప్రాంతాల నుండి సుమారుగా 30 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది .కార్యక్రమంలో భాగంగా సీనియర్ చెస్ కోచ్ కొప్పర్తి శివయ్య, డి.పూజిత పాల్గొన్నారు

# జమ్మికుంటలో రైతు నేస్తం కార్యక్రమం -- రైతులకు కీలక మార్గదర్శనం



కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 19

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ తెలిపారు (20-04-2026, సోమవారం రోజున జమ్మికుంట మండలంలోని జమ్మికుంట, వావిలాల, తనుగుల రైతు వేదికల్లో మధ్యాహ్నం 3:00 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా "రైతు నేస్తం" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులకు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా మట్టి నమూనాల ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణ విధానం, సూక్ష్మ పోషకాల అవసరం, సాయిల్ హెల్త్ కార్డు ఉపయోగాలు వంటి విషయాలపై సాయిల్ హెల్త్ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. అదనంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న రైతులకు వివిధ ప్రభుత్వ పథకాలలో ఎదురయ్యే సమస్యలపై స్పష్టమైన వివరణ అందించబడుతుంది.అలాగే వేసవి కాలంలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పాటించవలసిన ముందస్తు నేలల యాజమాన్య పద్ధతులపై రాష్ట్రస్థాయి శాస్త్రవేత్తలు మార్గనిర్దేశనం చేయనున్నారు.ఇక సాయంత్రం 5:00 గంటలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరుపల్లి గ్రామం వేదికగా "2వ విడత రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం"ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.కావున మండలంలోని రైతు సోదరులు తమకు సమీపంలోని రైతు వేదికలకు హాజరై ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు.

# వైభవంగా ప్రారంభమైన దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవ పూజలు

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 19



ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గోపూజ, గణపతి పూజ నిర్వహిస్తున్న ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గురు ప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన,గణపతి హోమం, రాజోపచార పూజలను ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ నిర్వహించారు.ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి వేములవాడ ద్రోణాచారి, అలయ కమిటి సభ్యులు నీరుమల్ల తిరుపతి, పల్లెర్ల శ్రీనివాస్, హరిచంద్రప్రసాద్, తౌడుపునూరి వేణుగోపాల్, మోటూరి ఆంజనేయులు, భక్తులు పాల్గోన్నారు.

# బూర్జువా పార్టీలను వీడి జాగృతిలో చేరండి

- ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి రావాలి: కల్వకుంట్ల కవిత
- తెలంగాణ జాగృతిలో చేరిన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు





**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, ఏప్రిల్ 19**
ప్రజలకు నిజమైన సేవ చేసేందుకు అడ్డంకిగా మారిన బూర్జువా పార్టీలను వీడి, తెలంగాణ ఆత్మగౌరవం కోసం కొత్త రాజకీయ శక్తిగా ముందుకు వస్తున్న తెలంగాణ జాగృతిలో చేరాలని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కష్టపడ్డ ఉద్యమకారులంతా ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధి కోసం మరోసారి ఒక్కతాటిపైకి రావాల్సిన సమయం వచ్చిందన్నారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ బాపూరావు ఆదివారం తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా కవిత ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 2007లో కుటుంబంతో కలిసి బోథ్ ప్రాంతానికి వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించామని గుర్తు చేశారు. వానాకాలంలో గూడాలు, మన్నెం జ్వరాలతో బాధపడుతున్న ప్రజల పరిస్థితి చూసి తెలంగాణ సాధన కోసం అందరం ఐక్యంగా ఉద్యమించామని తెలిపారు. ఏ స్ఫూర్తితో రాష్ట్ర సాధన కోసం పోరాడామో, అదే స్ఫూర్తితో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.రాథోడ్ బాపూరావు గతంలో తెలంగాణ జాగృతి నుంచి బీఆర్ఎస్‌లో చేరి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఇప్పుడు మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయబోయే రాజకీయ వేదికలో చేరుతున్నారని కవిత పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు జాగృతి వైపు వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్త పార్టీకి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కూడా జాగృతిలో చేరినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కవిత ఇచ్చిన ధైర్యంతోనే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని, రెండుసార్లు ఎమ్మెల్యేగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఇతర పార్టీల్లో తగిన గుర్తింపు లభించలేదని, ఇకపై కవిత నాయకత్వంలో పనిచేస్తానని తెలిపారు. త్వరలో ఇచ్చోడలో భారీ బహిరంగ సభ నిర్వహించి తన అనుచరులను పెద్ద సంఖ్యలో జాగృతిలో చేర్పిస్తానన్నారు.

జనగణనలో ఆదివాసీల మతానికి ప్రత్యేక కాలమ్ ఉండాలి

జనగణనలో ఆదివాసీల మతాన్ని నమోదు చేసేందుకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్టిట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ నాయకులు ఖమ్మం మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర ఆధ్వర్యంలో జాగృతి కార్యాలయంలో కవితను కలిసి తమ సమస్యలను వివరించారు.
కవిత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెసా చట్టాన్ని బలహీనపరుస్తూ ఆదివాసీల హక్కులను హరిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో ఆదివాసీలకు కల్పించిన రక్షణలను నిర్వీర్యం చేస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా లక్షలాది మంది ఆదివాసీలు అడవుల నుంచి దూరమవుతున్నారని, వారికి అన్ని సౌకర్యాలతో కూడిన పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. జనగణనలో మతం విభాగంలో ఆదివాసీ అనే ప్రత్యేక కాలమ్ లేకపోవడం వల్ల వారు తమ స్వీయ మతాన్ని గర్వంగా నమోదు చేసుకునే అవకాశం కోల్పోతున్నారని విమర్శించారు. దేశ మూలవాసులైన ఆదివాసీల సంస్కృతిని ఇది అవమానించడమేనన్నారు. అలాగే ఆదివాసీల భాష 'కోయతూర్'ను భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలోని 12 కోట్ల మంది ఆదివాసీల గౌరవాన్ని కాపాడేలా తాము ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీ పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్, ఆదివాసీ జాగృతి అధ్యక్షుడు లోకిని రాజు, పాడూరి శ్రీనివాస్, పాయం సత్యనారాయణ, మాడవి నర్సింగరావు, వట్టం నారాయణదొర తదితరులు పాల్గొన్నారు.

## ఇ. వి సతీష్ కుమార్ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ ఇనుగాల, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు



**కరపత్రం ప్రతినిధి ఏప్రిల్ 19**
హనుమకొండ టీచర్స్ కాల్స్ కాలనీ నందు టిపిసిసి ప్రధాన కార్యదర్శి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్ రావు సోదరుడు ఇ.వి. సతీష్ కుమార్ దశదిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇ.వి శ్రీనివాస్ రావుని పరామర్శించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**కరపత్రం ప్రతినిధి ఏప్రిల్ 19**
రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి శ్రీనివాస్ రావు సోదరులు ఇ.వి సతీష్ కుమార్ ఇటీవల మరణించగా, వారి దశదినకర్మ కార్యక్రమం నేడు ఎన్.వి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య సతీష్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇ.వి శ్రీనివాస్ రావు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## హెల్త్ హబ్ గా హైదరాబాద్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్ 19**



హైదరాబాద్ ను హెల్త్ హబ్ తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బర్కత్ పుర లోని డాక్టర్ ఆనంద్ ఇంటర్నేషనల్ హేయిర్ ట్రాన్స్ ప్లాంట్, స్కిన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొని ఆధునాతనమైన స్కిన్, హేయిర్ లేజర్ మిషన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వనున్న డిజిటల్ హెల్త్ కార్డుల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, మరో ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద సంగారెడ్డిని ఎంపిక చేయడం జరిగిందని, మంచి ఫలితాలు వస్తున్నాయని దానిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి పూర్తి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దేశంలో తెలంగాణను వైద్య రంగంలో ఆదర్శంగా తీసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వైద్యానికి అత్యంత అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి. ఆనంద్ కుమార్, డాక్టర్ సమత, దీపక్, శిల్ప, హరికుమార్, లాస్య, ఉమా, సమిత, ఆర్.కె.జైన్, శేషునారాయణ, టి.ఆనంద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా: బండారి లక్ష్మారెడ్డి

- ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్, ఎలక్ట్రానిక్ ) డైరీ ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి ఉప్పల్, ఏప్రిల్ 19**
జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చునని సూచించారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా) నూతన సంవత్సర – 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో జరిగింది. ఉప్పల్ ప్రెస్ క్లబ్(పి,ఈ) అధ్యక్షులు వద్దేపల్లి కిషోర్, క్లబ్ ప్రధాన సలహాదారులు కంచుకట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. ఉప్పల్ ప్రాంత జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన ప్లాట్ల విషయాన్ని కూడా అసెంబ్లీలో లేవనెత్తానున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేలా ప్రయత్నం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేలా కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, తెలంగాణా హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ చైర్పర్సన్ డా: శ్రీవాణి చౌదరి, లీగల్ అడ్వైజర్ హైకోర్టు న్యాయవాది కోండ్రోన్ పల్లి గిరిబాబు,వివిధ పార్టీల నాయకులు తాడూరి శ్రీనివాస్, గంధం నాగేశ్వరరావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఆకారపు అరుణ్ పటేల్, నెర్ధం భాస్కర్‌గౌడ్, కోల రవికుమార్‌గౌడ్, ఎండి. రఫిక్, కంది శ్రవణ్ కుమార్, జలీల్‌పాషా, గుడి మధుసూదన్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, పిట్టల నరేష్, తెలంగాణ సంపత్, నాగరాజు, చల్ల వీరారెడ్డి, మార్నేని ఫణీంద్ర, గోనె శ్రీకాంత్ ముదిరాజ్, పూజల ప్రభాకర్, కొంపల్లి రవీందర్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు,సకినాల ప్రసాద్, మేకల దయాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, సంయుక్త కార్యదర్శి వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శులు ఆనంద నరసింహారెడ్డి, పంబిళ్ల కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్లు కీర్తి సంతోష్ రాజ్, పయ్యావుల సంతోష్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీ-లిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై అన్యాయం చేయాలనే బీజేపీ కుట్ర

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు నకరకంటి మోహన్ గౌడ్



**కరపత్రం ప్రతినిధి ఏప్రిల్ 19**
డీ–లిమిటేషన్ పేరుతో మహిళా రిజర్వేషన్ బిల్లును అనుసంధానం చేసి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలనే బీజేపీ మైండ్ గేమ్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు నకరకంటి మోహన్ గౌడ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించారని విమర్శించారు. మహిళా బిల్లును ప్రత్యేకంగా అమలు చేయకుండా, డీ–లిమిటేషన్ అంశంతో కలిపి దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మోహన్ గౌడ్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ విధానాలను కచ్చితంగా అమలు చేశాయని, అందువల్ల ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా తక్కువగా ఉందన్నారు. ఇప్పుడు అదే కారణంగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించే కుట్రలో భాగంగానే డీ–లిమిటేషన్ అంశాన్ని ముందుకు తెచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ముఖ్య మంత్రులతో చర్చించి డీ–లిమిటేషన్‌కు వ్యతిరేకంగా పోరాడి విజయాన్ని సాధించారని కొనియాడారు. మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ గౌరవం ఉందని, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రత్యేకంగా ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ ముందుగానే డిమాండ్ చేసిందని గుర్తు చేశారు. బీజేపీ నేతలు అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, తెలంగాణ ప్రజలు వారి కుట్రలను గమనించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అగౌరవపరిచేలా మాట్లాడుతున్న బీజేపీ నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ గౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలనైనా కాంగ్రెస్ పార్టీ ప్రజాక్షేత్రంలో తీవ్రంగా ఎండగడుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ గౌడ్ స్పష్టం చేశారు.

# ఇల్లందలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

- ఇతర పార్టీల నుంచి 100 మందికి పైగా బీఆర్ఎస్‌లో చేరిక
- రాబోయే స్థానిక ఎన్నికలకు ఇల్లంద నుంచే శంఖారావం: ఆరూరి రమేష్





**కరపత్రం ప్రతినిధి ఏప్రిల్ 19**
వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఇల్లంద గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.
మేడి సురేష్, సట్ల రాజు, సట్ల లక్ష్మీనారాయణ, పెద్దగొని రవీందర్, కోటేశ్వర్, సట్ల మహారాజ్, మల్లెపాక భాస్కర్, మైదం భాస్కర్ తదితరులతో పాటు సుమారు 100 మందికి పైగా కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై విసుగెత్తి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారికి ఆరూరి రమేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు..ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు వింటేనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భయం పట్టుకుంటోందని విమర్శించారు. కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.
రేవంత్ రెడ్డి మాయ మాటలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని, రెండున్నర సంవత్సరాల పాలనతో కాంగ్రెస్ అసలు స్వరూపం ప్రజలకు అర్థమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలలో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అందరూ ఐక్యంగా పనిచేసి రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఇల్లంద గ్రామం నుంచే విజయ శంఖారావం పూరిద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టి. జాగృతి హన్మకొండ జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిర్ర లలిత కుమారి ఎన్నిక



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, ఏప్రిల్ 19**
తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు హన్మకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం చిర్ర లలిత కుమారిని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా నియమించారు. ఈ మేరకు చిర్ర లలిత కుమార్ కి తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీశైలం నియామక పత్రాన్ని అందజేశారు. జాగృతి పార్టీలో జరిగే కార్యక్రమాలు కార్యకర్తలను సమన్వయం చేయడంలో, పార్టీకి సంబంధించిన విధి విధానాలను జిల్లా పరంగా అన్నిటిని కో–ఆర్డినేషన్ చేస్తూ లలిత కుమారి వ్యవహరిస్తారని డాక్టర్ పర్లపెల్లి శ్రీశైలం వెల్లడించారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ.. ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన కల్వకుంట్ల కవితకి ధన్యవాదాలు తెలియజేస్తూ కచ్చితంగా పార్టీని సమన్వయం చేస్తూ ముందుకు తీసుకెళ్లడంలో నా వంతు బాధ్యత ఉంటదని తెలియజేశారు. అదేవిధంగా నా ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.